కంటిఅద్దాల కోసం ఎదురుచూపు

- నేటికి పూర్తిస్థాయిలో అందని వైనం
- 13,064మందికి మాత్రమే రీడింగ్ అద్దాలు పంపిణీ
- ఆపరేషన్లపై స్పష్టత కరువు


అన్నారంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

వనపర్తి క్రైం/పాన్‌గల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో కళ్లద్దాల కోసం బాధితులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మొదటి విడతలో పలువురికి కళ్లద్దాలు సరఫరా కాలేదు. ప్రస్తుతం రెండో విడత జిల్లాలో గత నెల 19న ప్రారంభమైంది. వైద్య శాఖ అధికారులు ఇప్పటి వరకు 508 క్యాంపులు నిర్వహించారు. దగ్గరి చూపు మందకొడిగా ఉన్న వారికి రీడింగ్ అద్దాలు అందజేస్తున్నా.. ప్రత్యేక కళ్లద్దాలు ఆర్డర్ చేస్తున్నారు. వీటిని రెండు వారాల్లో ఇస్తామని పేర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో బాధితులకు అందడం లేదు.

మొదటి విడతలో ఇలా..

మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో 2018 ఆగస్టు 15న వీరాయిపల్లిలో అప్పటి కలెక్టర్ ప్రారంభించారు. ఎన్నికల కారణంగా 2019 ఫిబ్రవరి 26న నిలిపివేశారు. దీంతో ఎంతోమంది కంటి సమస్యతో బాధపడుతున్న వారికి ఇబ్బందులు తప్పలేదు. దాదాపు 206 రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో 1,540 క్యాంపులు నిర్వహించారు. వీటిలో 3,17,173మందికి పరీక్షలు చేయగా, 78,313 మందికి మాత్రమే అద్దాలు పంపిణీ చేశారు. 9వేల మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించగా, కంటి వెలుగు నిలివేసిన కారణంగా 2,642మందికి చేయలేదు.

రీడింగ్ అద్దాలు మాత్రమే..

జనవరి 19న చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో ఇప్పటి వరకు 1,01,201మంది పరీక్షలు నిర్వహించారు. 13,064మంది దగ్గరి చూపు ఉన్న వారికి రీడింగ్ అద్దాలు అందజేశారు. ఈ శిబిరాల్లో దూరపు చూపు అవసరమున్న 12,584మందికి అద్దాలు ఇవ్వాల్సి ఉండగా, జిల్లాకు కేవలం 1,667 అద్దాలు మాత్రమే వచ్చాయి. అందులో 300 మాత్రమే ప్రిస్క్రిప్షన్ అద్దాలు ఇచ్చారు. పరీక్షలు చేయించుకున్న బాధితులు కళ్లద్దాలు ఎప్పుడొస్తాయని ఎదురుచూస్తున్నారు. శస్త్ర చికిత్సల కోసం 6వేల మందిని గుర్తించగా, ఇప్పటికీ స్పష్టత లేదు.

నెల రోజులు దాటినా..



కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకొని నెల రోజులు కావస్తున్నా నేటికీ ప్రత్యేక అద్దాలు పంపిణీ చేయలేదు. పరీక్షలు చేసిన సమయంలో ఇచ్చిన రీడింగ్ గ్లాసులు పెట్టుకున్న అ వి సక్రమంగా కనిపించడం లేదు. కావున ప్రత్యేక అద్దాలు త్వరగా అందించాలి. – బిచ్చమ్మ, మల్లాయిపల్లి

ఆపరేషన్ ఎప్పుడో..



కంటి పరీక్షలు చేయించుకుంటే శస్త్రచికిత్స చేయాలని సూచించారు. సిఫార్సు చేసి పది రోజులు దాటినా స్పష్టత లేదు. ఆపరేషన్‌కు సిఫార్సు చేసిన వారిని గ్రామాల వారిగా ఎప్పుడు తీసుకవెళ్తారో స్పష్టంగా తెలియపరిస్తే ఎదురుచూసే పని ఉండదు. దీనిపై అధికారులు స్పందించి వివరాలు తెలియపర్చాలి. – బాలమ్మ, పాన్‌గల్

రాగానే అందజేస్తాం..



12,584 మందికి దూరపు చూపు సమస్య ఉందని గుర్తించాం. 1,667 అద్దాలు రాగా, అందులో 300 దాకా పంపిణీ చేశాం. మిగిలిన అద్దాలు అందజేస్తాం. ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు వచ్చిన వెంటనే అందరికి అందజేస్తాం. దగ్గరి చూపు కంటి పరీక్షలు చేసిన వారందరికీ రీడింగ్ అద్దాలు ఇచ్చాం. ఇప్పటి వరకు 508 క్యాంపులు నిర్వహించాం. – సాయినాథ్ రెడ్డి, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి, వనపర్తి

మెనూ ప్రకారం భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక, గోప్లాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, సామర్థ్యాలను పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచేలా బోధన చేయాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలలో మన ఊరు–మన బడి పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం


వీపనగండ్లలో నిరసన తెలుపుతున్న నాయకులు

వీపనగండ్ల: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. మండల కార్యదర్శి బాల్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులను బలోపేతం చేసేందుకు పేద ప్రజలకు ఇస్తున్న రాయితీలను తొలగిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పోషిస్తూ ప్రజలను విడదీసి అధికారంలోకి రావాలని చూస్తుందన్నారు. ఉద్యోగ ఉపాధి కల్పన రంగాలను నిర్వీర్యం చేస్తుందని, దీంతో అనేక కుటుంబాలు రోడ్డు పాలవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, ఆశన్న, రామకృష్ణ, నవీన్, తిరుపతయ్య, రైతులు పాల్గొన్నారు.

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలందరూ తిరుగుబాటు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని సీపీఎం నాయకులు వెంకటేష్, రమేష్ అన్నారు. పట్టణంలో శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో శ్రీను, వెంకటేష్, రమేష్, సూరి, అంజి పాల్గొన్నారు.

ఉర్సును జయప్రదం చేయండి


ఫ్లెక్సీలను విడుదల చేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

అమరచింత: పట్టణ కేంద్రంలో వెలసిన సయ్యద్ షా రాజావలి దర్గా షరీఫ్ ఉర్సును మార్చి 10 నుండి 12 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటి సభ్యులు మైను, రఫీక్, ఫరీద్ తెలిపారు. శుక్రవారం నమాజు అనంతరం దర్గా ఆవరణంలో ఉర్సు సంబంధించిన ఫ్లెక్సీలను విడుదల చేశారు. ఎంతో చరిత్ర కలిగి, భక్తుల కోరిన కోర్కెలు తీర్చే భగవంతుడిగా పూజలందుకుంటున్న రాజావళి దర్గాకు ఏటా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారని వెల్లడించారు. 10న గంధోత్సవం, 11న తాజే చిరాక్, 12న ఖత్మేఖురాన్‌తో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. మూడు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఖవ్వాలి ఉంటుందన్నారు.

భవిష్యత్‌కు ఇంటర్ పునాది


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

పాన్‌గల్: భవిష్యత్‌కు ఇంటర్ విద్య పునాది లాంటిదని, దీనికి అనుగుణంగా లక్ష్యం నిర్దేశించుకుని చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఎస్‌ఐ నాగన్న విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవం, వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలపై ఒత్తిడికి లోనుకాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేటు కళాశాలలకు దీటుగా వసతులు, విద్య అందుతున్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేష్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని అడ్డుకోవడం సమంజసం కాదు'


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు

అమరచింత: పట్టణంలో ఎమ్మెల్యే నిధులతో నిర్మిస్తున్న దుకాణ సముదాయాలను బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అయ్యుబ్, ప్రధాన కార్యదర్శి తౌఫిక్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వి లేకరుల సమావేశంలో మాట్లాడారు. 2018లో ఎమ్మెల్యే ఇచ్చిన నిధులతో పనులను మసీద్ కమిటీ ద్వారా చేపట్టినట్లు తెలిపారు. దీంతో బీఆర్‌ఎస్ చెందిన నాయకులు తమ వ్యాపారాలు దెబ్బతింటాయన్న అక్కసుతోనే వీటిని వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని ఖబరస్తాన్ ప్రధాన రహదారికి దగ్గరగా ఉండటంతో, వీటిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే మసీద్‌కు ఆదాయంతో పాటు వ్యాపార అభివృద్ధి అవుతుందని బీఆర్‌ఎస్ నాయకులే నిధులు ఇప్పించి ఇప్పుడు అడ్డుకుంటున్నారన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ సహరించాలని కోరారు. కార్యక్రమంలో జుబేర్‌ఆహ్మద్, ఖాసీం, అక్బర్, సద్దాం, ఇస్మాయిల్, ఆబిద్, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ


గోపాల్‌పేటలో జీవాలకు మందులు వేస్తున్న వైద్య సిబ్బంది

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడలో జిల్లా గొర్రెల కాపరుల సంఘం డైరెక్టర్ నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను శుక్రవారం అందించారు. తప్పనిసరిగా సీజన్‌ను బట్టి నట్టల నివారణ మందులు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది గంగరాజు, గ్రామస్తులు శ్రీను, అబ్దుల్లా, వెంకటస్వామి, పాల్గొన్నారు.

గోపాల్‌పేట: రైతులు పశువులు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తప్పనిసరిగా వేయించాలని డాక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రేవల్లి, శానాయిపల్లి, గోపాల్‌పేట మండలంలోని బుద్దారం, తండాల్లో నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. గోపాల్‌పేటలో 5,351 గొర్రెలు, 614 మేకలకు, రేవల్లి మండలంలో 7,638 గొర్రెలు, 386 మేకలకు మందులు వేసినట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీనివాసులు, వెంకటరమణమ్మ, పురుషోత్తం, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు అందిస్తున్న నట్టల నివారణ మందులను గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్యామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి, మాందాపూర్‌లో జీవాలకు నట్టల నివారణ మందులను తాగించారు.

వేసవిలో మొక్కలకు నీరు పోయండి


గుమ్మడంలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నర్సింహులు

పెబ్బేరు: వేసవి కాలంలో మొక్కలకు నీరుపోసి బతికించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నర్సింహులు అన్నారు. శుక్రవారం మండలంలోని గుమ్మడం, తిప్పాయిపల్లిలో నర్సరీలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రతి మొక్కకు నీరు పోయాలని, ప్రకృతివనంలో ఎప్పటికప్పుడు కలుపు తీయడం, చల్లని వేళలో వాటరింగ్ చేయాలని, నర్సరీకి షేడ్ నెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ప్రతి శుక్రవారం మొక్కలకు నీరు పోయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి బాలరాజు, గోపాల్‌రెడ్డి, టీఏ యాదగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాందాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. దీంతో పాటు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను, దళితబంధు ద్వారా మంజూరైన యూనిట్‌ను పరిశీలించారు.

కుక్కలతో విద్యార్థులు జాగ్రత్త


వీపనగండ్లలో అంగన్‌వాడీ టీచర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ రామన్‌గౌడ్

వీపనగండ్ల: గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలల ఆవరణలోకి వస్తున్న ఊర కుక్కలతో జాగ్రత్త వహించాలని ఎస్‌ఐ రామన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కుక్కలు ఉండడాన్ని గమనించిన ఆయన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లతో మాట్లాడారు. కుక్కలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులదేనని అన్నారు.

విద్యార్థులకు అవగాహన

అమరచింత: గ్రామలతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఊర కుక్కల బెడద ఎక్కువగా ఉందని వీటి నుంచి చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అవగాహన కల్పించారు. పాఠశాలకు వెళ్తున్న, ఇంటికి వస్తున్న సమయాల్లో ఊర కుక్కలు ఎక్కువగా ఉంటే సమాచారాన్ని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పాలన్నారు. త్వరలోనే ఊర కుక్కలు పట్టణంలో సంచరించకుండా మున్సిపల్ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోపి, కమిషనర్ మహమ్మద్ ఖాజా, నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీచేసి మెజార్టీ సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో ప్రజా గోస – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ శక్తికేంద్రం ఇన్‌చార్జ్ బుచ్చిబాబుగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని.. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీసినా, నిరసన ప్రదర్శనలు చేపట్టినా ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసులతో అరెస్టులు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేసేందుకు చూస్తున్నారని తెలిపారు. ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్‌ను గద్దెదించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, బుచ్చిబాబుగౌడ్, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, గోపీనాయక్, రాంచందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


జూరాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు


అమరచింతలో..

ఆత్మకూర్: మండలంలోని జూరాలలో ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, సీఆర్పీ సౌమ్యరాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాలికల పాఠశాలలో..

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులను అందించారు.

వైద్యసిబ్బందికి సన్మానం



గోపాల్‌పేట: వైద్యులు, సిబ్బంది సేవలు మరువలేనివని సర్పంచ్ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ శేఖర్ అన్నారు. శుక్రవారం కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం చేశారు. మండలంలో మొత్తం 4,423 మందికి కంటిపరీక్షలు, 615 మందికి రీడింగ్ గ్లాసెస్, 425 మందికి ఆపరేషన్ కోసం రెఫర్ చేశామని డాక్టర్ మంజుల తెలిపారు. 27నుంచి ఏదుట్లలో కంటివెలుగు కార్యక్రమం ప్రారంభం అవుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

కాల్వలో జమ్ము తొలగింపు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామానికి వచ్చే కేఎల్‌ఐ కాల్వలో పేరుకపోయిన జమ్మును సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి సొంత ఖర్చులతో జేసీబీ సాయంతో తొలగించినట్లు శుక్రవారం రైతులు తెలిపారు. మండలంలోని మంగళ్లపల్లి వైపు నుంచి కేతేపల్లి వైపు కేఎల్‌ఐ కాల్వలో జమ్ము పేరుకపోయి సాగునీరు ముందుకు రావడం లేదనే విషయాన్ని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



గోపాల్‌పేట: మండలంలోని పొలికెపాడులో శుక్రవారం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం



మదనాపురం: ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు తపస్ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు. సంఘం బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెంకటనారాయణను గెలిపించాలని శుక్రవారం మండలంలోని కేజీబీవీ, దుప్పల్లి, అజ్జకొల్లు, కొన్నూర్ పాఠశాలలో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కృష్ణ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గోపాల్‌పేట: సుదీర్ఘ అనుభవం ఉన్న కాటేపల్లి జనార్దన్‌రెడ్డి గెలిపించాలని పీఆర్టీయూ నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఉమ్మడి మండలంలోని కేజీబీవీలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం చేశారు. జనార్దన్‌రెడ్డిని గెలిపిస్తే కేజీబీవీల్లో పనిచేస్తున్న ఎస్‌ఓ, సీఆర్‌టీ, అకౌంటెంట్లను, కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

మధ్య దళారులను ఆశ్రయించొద్దు

చిన్నంబావి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో దళారులపై చర్యలు తప్పవని తహసీల్దార్ ఝాన్సీరామ్‌నాయక్ శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు. కొంత మంది కార్యాలయానికి వచ్చే అర్జీదారులతో డబ్బులు వసూలు చేసి పైరవీలు చేస్తున్నారని కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆదాయ, ధ్రువపత్రాలకు కొంతమంది డబ్బులు వసూలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, వారిపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. అదే విధంగా దళారులకు డబ్బులు ఇచ్చిన వారిపై కూడా చర్యలు ఉంటాయని, ఎవరికైనా కార్యాలయంలో పనులు ఉంటే తన దగ్గరకు రావాలని దళారులను నమ్మవద్దని సూచించారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

పాన్‌గల్: మన ఊరు–మన బడి పథకం ద్వారా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతగా చేపడుతూ త్వరగా పూర్తిగా చేయాలని పీఆర్ ఏఈ సత్తయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాల పనులను పరిశీలించి ఆయా పనులపై పాఠశాల హెచ్‌ఎం, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల పురోగతిపై ఆరా తీశారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

అమరచింత: ఆత్మనిర్భర్ పథకంలో భాగంగా బ్యాంకు రుణాలను పొందిన చిరు వ్యాపారులకు క్యూఆర్‌కోడ్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజా అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చిరు వ్యాపారులకు అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలను పొందిన చిరు వ్యాపారులందరికీ బ్యాంకు లావాదేవీలు ఆన్‌లైన్‌లో చేసేలా క్యూఆర్ కోడ్‌ను అమలు పర్చి అందిస్తున్నట్లు తెలిపారు. మెప్మా ఏపీఎం యువరాజ్, ఆర్‌పిలు గోపాల్, రాజేశ్వరి పాల్గొన్నారు.

రోడ్లు నాణ్యతగా వేయండి

అమరచింత: పట్టణంలో సీసీ రోడ్లు నాణ్యతతో వేయాలని 2వ వార్డు కౌన్సిలర్ మంగ లావణ్య శుక్రవారం తెలిపారు. టీయూఎఫ్‌డీసీ నిధులను దుర్వినియోగం చేస్తు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. రోడ్డు నిర్మాణ వ్యవహారంలో 4 మీటర్ల వేయాల్సిన రోడ్లను కేవలం 2 నుంచి 3 మీటర్ల మేరకు వేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, ఏఈలకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. నాణ్యత లేని సీసీ రోడ్లతో క్యూరింగ్‌లేక పగుళ్లు ఏర్పడుతున్నాయని అన్నారు.

ఉద్యమ నాయకురాలికి ఘననివాళి



వనపర్తి క్రైం: ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిన ఉద్యమ నాయకులను స్మరించుకోవాలని ఐద్వా మహిళ సంఘం నాయకురాలు సుగణమ్మ అన్నారు. శుక్రవారం ఉద్యమ నాయకురాలు లక్ష్మి వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఐద్వా సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రసన్న, మమత, లావణ్య, జ్యోతి, బాలమ్మ, సావిత్రి తదితరులు ఉన్నారు.

33వ సారి రక్తదానం



వనపర్తి క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన అశోక్‌కుమార్, శ్రీదేవి దంపతులు శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఇప్పటివరకు అశోక్‌కుమార్ 33 సార్లు రక్తదానం చేయగా, శ్రీదేవి మొదటిసారి రక్తదానం చేశారని రెడ్‌క్రాస్ చైర్మన్ ఖాజాకుతుబుద్దీన్ తెలిపారు.

శిథిలావస్థకు చేరిన క్లబ్ భవనం



ఆత్మకూర్: పట్టణంలోని క్లబ్ భవనం శిథిలావస్థకు చేరింది. ముక్కెర రాజవంశీయులు అమరచింత సంస్థానాధీశులుగా కొనసాగుతున్న కాలంలో ఈ భవనంలో ఏటా నిర్వహించే స్వయంభూ పరమేశ్వరస్వామి జాతరకు వచ్చేవారని స్థానికులు చెబుతున్నారు. కాలానుగుణంగా భవనాన్ని క్లబ్ నిర్వహణ కోసం ఇచ్చారు. కొన్నేళ్లుగా భవనం వాడుకలో లేకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ప్రజాప్రతినిధులు, అధికారులు మరమ్మతు చేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.